క్లుప్తంగా

సన్మానం



ఎల్లంను సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

చేగుంట(తూప్రాన్): ఇటీవల అంబేడ్కర్ జయంతి రోజున కలెక్టర్ కార్యాలయంలో సేవ పురస్కారం అందుకున్న ఎల్లంను దళిత సంఘాల నాయకులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎర్రయాదగిరి మాట్లాడుతూ.. రిపోర్టర్‌గా పని చేస్తున్న ఎల్లంకు సేవ పురస్కారం వచ్చినందుకు దళిత సంఘాల ఆధ్వర్యంలో చేగుంటలో సన్మానించామని తెలిపారు. కార్యక్రమంలో గుడ్డి కృష్ణ, నీల రాంలు, వెంకట్, లక్ష్మీనారాయణ, జానీ, నవీన్ తదతరులు ఉన్నారు.

చేయూత

రేగోడ్(మెదక్): మండలంలోని మర్పల్లి గ్రామంలో గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన అంజద్‌పాషా కిడ్నీ సమస్యతో కొన్ని రోజులుగా బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పీసీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.సర్దార్ రూ.5వేలు, బీఆర్ఎస్ నాయకులు ఫాజిల్ రూ.1000, బాబా రూ.1000 ఆర్థిక సాయాన్ని అందజేశారు.

‘మైనంపల్లి’ కోలుకోవాలని పూజలు

చిన్నశంకరంపేట(మెదక్): మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు త్వరగా కోలుకోవాలని మండలంలోని కొర్విపల్లి గ్రామంలో వెలసిన దుర్గమాత ఆలయంలో ఆయన అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మోకాలు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. దీంతో ఆయన త్వరగా కోలుకోవాలని మండల ఎంఎస్ఎస్‌ఓ సభ్యులు సుభాష్ చంద్రభోస్, మేడి గణేశ్, కరాటే శివ, విశాల్, రాజు, మనోహర్, నిఖిల్ ప్రత్యేక పూజలు చేశా రు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



పొలాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్ రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నర్సాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండలంలోని కాజీపేట తదితర గ్రామాల్లో పర్యటించి, అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. వరి పంట చేతికి వచ్చినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దిగంబర్‌రావు, నగేశ్ గౌడ్, శ్యామ్, శ్రీశైలం, ఆకాష్, భిక్షపతి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళి

గజ్వేల్‌రూరల్: ఉగ్రవాదుల దాడిలో అమరులైన భారత సైనికులకు హైందవులు నివాళులర్పించారు. శనివారం రాత్రి పట్టణంలోని స్వామి వివేకానంద చౌరస్తా వద్ద ప్రారంభమైన కొవ్వొత్తుల ర్యాలీ అంబేడ్కర్ చౌరస్తా నుంచి జాలిగామ బైపాస్ రోడ్డు గుండా ఇందిరాపార్కు చౌరస్తా నుంచి ఢిల్లీవాల హోటల్ మీదుగా తిరిగి ఇందిరాపార్కు చౌరస్తా వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైందవులు మాట్లాడుతూ.. ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన వీర జవాన్లు దేశానికి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు, దేశబోయిన నర్సింలు, గుంటుకు శ్రీను, మంతూరి నాగరాజు, మల్లికార్జున్, బాల్‌కుమార్, రమణ, నాయిని సందీప్, కాశమైన సందీప్, సంతోష్‌కుమార్, హన్మంతు, తులసీదాస్, శ్రీకాంత్, పేర్ల నర్సింలులతో పాటు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృత్తిక మహోత్సవం

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యా సరస్వతీ క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో శనివారం కృత్తిక మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రం పురస్కరించుకొని ఆలయ వ్యవస్థాపకుడు చంద్రశేఖర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో వేద పండితులు, వేద విద్యార్థులు లక్ష సుబ్రహ్మణ్య నామాలు పఠిస్తూ మూలవిరాట్‌కు భస్మార్చన చేశారు. విశేష అభిషేకం, అలంకరణ అనంతరం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడిని భక్తులు దర్శించుకొని తరించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దమ్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ సమావేశాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.



రామాయంపేట(మెదక్): ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శివ్వంపేట(నర్సాపూర్): చిన్నగొట్టిముక్కలో ..



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో..



రేగోడ్(మెదక్): మండల కేంద్రంలో ..



వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో ..

భక్తిశ్రద్ధలతో రంజాన్

జిల్లా వ్యాప్తంగా శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఆయా గ్రామాల్లో ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నర్సాపూర్: పట్టణంలో ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, సునీతారెడ్డిలను సన్మానించారు. రంజాన్ పండగను పురస్కరించుకొని ఆయా పార్టీల నాయకులు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, తెలంగాణ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



నర్సాపూర్: ఈద్గా వద్ద మదన్‌రెడ్డి, సునీతారెడ్డిలను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు



పెద్దశంకరంపేట(మెదక్): జూకల్‌లో..



తూప్రాన్: నాయకులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో ..



కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో ..



రామాయంపేట(మెదక్): నార్సింగిలో..



టేక్మాల్‌లో..



నిజాంపేటలో ..



అల్లాదుర్గం(మెదక్): గడిపెద్దాపూర్‌లో..



కౌడిపల్లి(నర్సాపూర్): వెంకట్రావ్‌పేటలో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): బండపోతుగల్‌లో..



చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో..



చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో..

కొనసాగుతున్న దీక్షలు



దీక్ష చేస్తున్న అఖిలపక్ష నేతలు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం పట్టణంలో అఖిలపక్షం నేతలు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 27వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ప్రకటించే వరకు తాము దీక్షలు విరమించమని అఖిలపక్షం ప్రతినిధులు స్పష్టం చేశారు. దీక్షలకు పట్టణంలోని యువజన సంఘాలవారు, కుల సంఘాల ప్రతినిధులు, వ్యాపార వర్గాల వారు తమ మద్దతు ప్రకటించారు.

అమ్మవారిని దర్శించుకున్న డీఆర్డీఓ



డీఆర్డీఓ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సర్పంచ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ శివారులోని చాముండేశ్వరి అమ్మవారిని శనివారం డీఆర్డీఓ శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో ఆయన్ను సర్పంచ్ గోపాల్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ మాట్లాడుతూ.. చాముండేశ్వరి ఆలయం ప్రశాంతంగా ఉందని, అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సోమక్కపేట్ సొసైటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, కార్యదర్శి తిరుపతి, ఈసీ భగవంత్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని జప్తిశివునూర్ గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళకు శనివారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. మెదక్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నార్సింగి ఎంపీపీ ఉపాధ్యక్షురాలు సుజాత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, గ్రామ పార్టీ నాయకుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య పరీక్షలు**



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లితో పాటు వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కౌడిపల్లితో రాజితండా, మనంతయపల్లి తండాల్లో వైద్యసిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాంలోని లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్నవారికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. రక్తహీనతను నివారించేందుకు ఆకుకూరలు, పాలు, కోడిగుడ్లు ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సునీత, మణి, సుమిత్ర, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

◆ **రాష్ట్ర బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి**

రామాయంపేట(మెదక్): తెలంగాణ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంట్రల్ కాలనీలో నిర్వహిస్తారని తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్యాకుల శ్రీనివాసశర్మ పేర్కొన్నారు. శనివారం ఆయన నార్సింగిలో మాట్లాడుతూ.. సాయిరాం ఫంక్షన్‌హాల్‌లో జరిగే ఈ సమ్మేళనానికి అన్ని జిల్లాల నుంచి సంఘం ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహణశర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగరేశ్వర సిద్ధాంతి, కోశాధికారి విజయసారథి, గౌరవ సలాహాదారుడు హనుమంతచారి, పాల్గొంటారని, సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని శ్రీనివాసశర్మ సూచించారు.

◆ **మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎంపికకు కసరత్తు**

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుల ఎంపిక కసరత్తు కొనసాగుతుంది. ఈనెల 10న నోటిఫికేషన్ జారీ కాగా, నామినేషన్లు వేయడానికి 18 చివరి తేదీగా ప్రకటించారు. నలుగురు కోఆప్షన్ సభ్యుల ఎంపిక కోసం బీఆర్ఎస్ నుంచి ఐరేని పృథ్వీరాజ్‌గౌడ్, పాతూరి ప్రభావతి, అహ్మద్, కౌసర్ బేగం మాత్రమే నామినేషన్లు వేశారు. వీరు నలుగురు సభ్యులుగా ఎన్నికవ్వగా, ఇంకా అధికారికంగా ప్రకటించ లేదు. ఈనెల 27న ప్రత్యేక సమావేశం నిర్వహించి, అధికారికంగా ప్రకటించనున్నారు.

◆ **గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించే ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని శనివారం ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. పరీక్ష కేంద్రంలో 400 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఆరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. దీని కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

◆ **రేపు కొల్చారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని గ్రామాల్లో సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎనిమిది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మూడు ఐకేపీ, రెండు ఫార్మర్ ప్రొడ్యూసర్ సంఘాల ద్వారా ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారన్నారు.

అంజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజనం సందడి నెలకొంది. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ సార శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, అర్చకులు దేవిశ్రీ, ప్రభుశర్మ, శ్రీవాత్సవ్, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ ఉన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి



మందు పంపిణీ చేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): వేసవికాలం దృష్టిలో పెట్టుకొని వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్యరెడ్డి, ఎస్ఐ రవికాంత్‌రావు అన్నారు. శనివారం మండలంలోని గోమారం గ్రామంలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడదెబ్బ తగలకుండా హోమియోపతి మందు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రానున్న కాలంలో ఎండలు అధికంగా ఉంటున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు వెళ్లాలని తప్పనిసరి వెళ్లాల్సి ఉంటే ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల కోసం ఏకలవ్య ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ మెదక్ రీజియన్ కో ఆర్డినేటర్ రాకేష్, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, రామేశ్వరం చండి రైతు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు కుంట లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాలు



సామూహిక సత్యనారాయణస్వామివ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయం వద్ద పురోహితులు ఉమాశంకరశర్మ రవిప్రసాద్‌శర్మ ఆధ్వర్యం వద్ద భ్రమరాంబ మల్లికార్జునస్వామి, విద్యాసరస్వతీదేవికి పంచామృతాభిషేకం నిర్వహించారు. దీంతో పాటు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం వేద పండితులు వెంకటరామశర్మ, శ్రీకాంత్‌శర్మ, నారాయణశర్మ, సృజన్‌శర్మ చండీహోమం చేశారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ కాజిపేట రాజేందర్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బీజేపీ కార్యకర్త సతీశ్ కుటుంబీకులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): ఇటీవల పొలంపల్లిలో మృతి చెందిన బీజేపీ కార్యకర్త సతీశ్‌గౌడ్ కుటుంబీకులకు ఎమ్మెల్యే రఘునందన్‌రావు రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. పొలంపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీజేపీ కార్యకర్త సతీశ్‌గౌడ్ కుటుంబీకులను పరామర్శించి ఆర్థికసాయం అందించి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇటీవల ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న చేగుంట విలేకరి ప్రకాశ్‌ను పరామర్శించి, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు గణేశ్‌రవికుమార్, మాజీ సర్పంచ్‌లు రఘువీర్, బాలచంద్రం, మాజీ ఎంపీపీ కర్ణపాండు, పలు గ్రామాల బీజేపీ నాయకులు ఉన్నారు.

ఈదురు గాలులు.. అకాల వర్షం



శివ్వంపేట(నర్సాపూర్):ఉసిరికపల్లిలో నేలరాలిన మామిడి



వెల్దుర్తి(తూప్రాన్): బొమ్మారంలో..



తూప్రాన్: నేలరాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో చేతికందిన వరి పంట, మామిడికాయలు అక్కడక్కడ నేలరాలాయి. కొన్ని ప్రాంతాల్లో వృక్షాలు నేలకూలాయి. ఈదురు గాలుల ప్రభావం అధికంగా ఉండడంతో సుమారు రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అకాలవర్షంతో దెబ్బతిన్న పంటల వివరాలు తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి మామిడి కాయలు నేలరాలాయి. చేతికి వచ్చిన వరి నేలవాలగా.. పలుచోట్ల వడ్లు రాలిపోయాయి. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు.

తూప్రాన్: అకాల వర్షం, ఈదురు గాలులకు మండలంలో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో పాటు అకాల వర్షానికి మండలంలోని ఆయా గ్రామాల్లో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు రూ. 20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు మామిడి రైతులు పేర్కొంటున్నారు.